క్లుప్తంగా

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వామపక్షాల ర్యాలీ



ఆరిలోవ కాలనీలో చేపట్టిన ర్యాలీలో వామపక్షాల నాయకులు

ఆరిలోవ : కూటమి ప్రభుత్వం ఇళ్లకు అమర్చుతున్న అదానీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆరిలోవలో వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి దుర్గాబజార్ మీదుగా టి.ఐ.సి.పాయింట్, అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. అదానీ స్మార్ట్ మీటర్లు మాకొద్దు..., ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఆయా ప్రతినిధులు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలపై ఈ నెల 5న గురుద్వార సమీపంలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐద్వా, మహిళా సమైక్య నాయకులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

తత్కాల్ టికెట్‌కు ముందు రోజు పేరు నమోదు

మరుసటిరోజు క్యూలో ఉంటే చాలు



దువ్వాడ రైల్వేస్టేషన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో తత్కాల్ టికెట్ తీసుకోవాల్సిన ప్రయాణికులు ముందురోజు రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన పత్రంపై పేరు, సీరియల్ నంబర్, ఆధార్ నంబర్ రాసి తర్వాత రోజు టికెట్ కోసం క్యూలో ఉంటే సరిపోతుంది. ఈ విధానం దువ్వాడ రైల్వేస్టేషన్ అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే తత్కాల్ టికెట్లను ముందు రోజు జారీ చేస్తారు. వాటి కోసం అదేరోజు తెల్లవారు జాము నుంచి ప్రయాణికులు స్టేషన్ వద్ద పడిగాపులు కాస్తుంటారు. దీంతో ప్రయాణికులు తోపులాటకు దిగుతుండడంతో దువ్వాడ రైల్వే కమర్షియల్ అధికారి ఎం.ఎస్.రావు చొరవ తీసుకొని ముందురోజు రాత్రి 9.30 పది గంటల మధ్యలో అధికారికంగా ఒక పేపర్ ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పేర్లు, ఆధార్ నంబర్ రాసి పెట్టి మరుసటిరోజు ఉదయం కౌంటర్ తెరవకముందు వస్తే సీరియల్ నంబర్ ప్రకారం పిలిచి టికెట్లు జారీ చేస్తున్నారు. దీంతో ఎవరు నమోదు చేశారో వారికే టికెట్ అందుతుండడం, ఏజెంట్లు హడావుడి లేకుండా ఆర్పీఎఫ్ సహకారంతో సజావుగా టికెట్ల జారీ ప్రక్రియ సాగుతుండడంతో ప్రయాణికులు హర్షిస్తున్నారు.



పోలీస్ మెస్ వద్ద నేలపైనే వ్యర్థాలు



బీచ్ రోడ్డులో లాన్‌లో వేసిన చెత్త, వ్యర్థాలు

తీరంలో పారిశుధ్యం అధ్వానం

- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు
- ఎప్పటికప్పుడు శుభ్రం చేయని పారిశుధ్య సిబ్బంది
- దుర్వాసనతో వాకర్స్, పర్యాటకుల అవస్థలు



ఫుట్‌పాత్‌పై చెత్త, పేపర్లు



యోగా విలేజ్ వద్ద డస్ట్ బిన్ పరిస్థితి

ఏయూ క్యాంపస్ : నిత్యం వేలాది మంది పర్యాటకులు, వాకర్స్‌తో కళకళలాడే సుందర సాగర తీరంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. బీచ్‌రోడ్డులో ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ఫలితంగా ఉదయం వేళల్లో వాకింగ్‌కి వచ్చే వారంతా తీర ప్రాంతంలో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తీరం నిండా చెత్త, పశువుల వ్యర్థాలతో అధ్వానంగా కనిపిస్తోంది. సాయంత్రం వేళల్లో సాగర తీరానికి వచ్చే పర్యాటకులు, నగరవాసులు తిని పడేసిన ప్లేట్లు, ఖాళీ సీసాలు వంటివి అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. సిల్వర్ స్పూన్ రెస్టారెంట్ వద్ద కేబుల్, ఇంటర్నెట్ వైర్లు ఫుట్‌పాత్‌పై దర్శనమిస్తున్నాయి. వాకింగ్‌కి వచ్చే వృద్ధులకు ఇవి ఎంతో ఇబ్బందికరంగా మారుతున్నాయి.

డస్ట్‌బిన్లున్నా చెత్తంతా లాన్‌లలోనే...

బీచ్‌రోడ్డుని ఆనుకుని ఉన్న వివిధ దుకాణాల వద్ద రాత్రి 11 గంటల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. దుకాణాల బయట ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు నామమాత్రంగా కనిపిస్తున్నాయి. అధిక శాతం మంది తాము తిన్న తర్వాత ప్లేట్లు, గ్లాసులు వంటివి అక్కడే లాన్‌లలో పడేస్తున్నారు. దీంతో పరిసరాలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. అదేవిధంగా డస్ట్‌బిన్‌లో వేసిన కవర్లు, ప్లేట్లు, మిగిలిన ఆహార పదార్థాల కోసం కుక్కలు, పశువులు పోటీ పడుతున్నాయి. ఇవి డస్ట్‌బిన్‌లను కిందకు పడేసి వ్యర్థాలను మైదానం నిండా పోస్తున్నాయి. దీంతో ఫుట్‌పాత్‌లు, లాన్‌లు దుర్వాసనతో అధ్వానంగా మారిపోతున్నాయి. పారిశుధ్య సిబ్బంది సేవలు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్లాస్టిక్ సీసాలను సేకరించి విక్రయించడంపై ఉన్న శ్రద్ధ వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించడంపై చూపడం లేదు. ఉదయం 8 గంటల తర్వాతే వీరు పూర్తి స్థాయిలో విధులకు హాజరవుతుండడంతో మార్నింగ్ వాకింగ్‌కి వచ్చే వారికి అపరిశుభ్ర వాతావరణం స్వాగతం పలుకుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తీరంలో, బీచ్ రోడ్డులో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు, వాకర్స్ కోరుతున్నారు.



రోడ్డుపైనే ప్రమాదకరంగా ఉన్న కేబుల్ తీగలు

ప్రమాదకరంగా ఓపెన్ బాక్స్‌లు



పైనాపిల్‌కాలనీ వద్ద బీఆర్‌టీఎస్ డివైడర్‌పై తలుపులు తెరుచుకొన్న కరెంట్ ఫ్యూజు బాక్సులు

ఆరిలోవ : అధికారుల నిర్లక్ష్యంతో బీఆర్‌టీఎస్‌పై విద్యుత్ ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా మారాయి. సాధారణంగా విద్యుత్ దీపాలను వెలిగించి, ఆర్పడానికి ఫ్యూజు బాక్సులను రోడ్ల పక్కన ఏర్పాటు చేస్తుంటారు. వాటి తీగలు బయటకు కనిపించకుండా తలుపులు వేసి మూసి ఉంచుతారు. పైనాపిల్‌కాలనీ వద్ద బీఆర్‌టీఎస్ డివైడర్‌పై పెద్ద ఫ్యూజు బాక్సులు ఏర్పాటు చేశారు. అయితే వాటి తలుపులు మాత్రం నిరంతరం తెరిచి ఉంచుతున్నారు. దీంతో వాటి నుంచి తీగలు బయటకు వేలాడుతున్నాయి. డివైడర్ మధ్య పచ్చిక మేయడానికి పశువులు నిత్యం తిరుగుతుంటాయి. వాటికి ఆ తీగలు తగిలితే చనిపోవాల్సిందే. పొరపాటున అటుగా వెళ్లే మనుషులకూ ఇది ప్రమాదకరమే. గత ఏడాది పెదగదిలి కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు డివైడర్‌లో పోలమాంబ ఆలయం వెనుక ఫ్యూజు బాక్సు నుంచి వేలాడిన తీగలు తగిలి ఓ ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా విద్యుత్ విభాగం అధికారులు నిర్లక్ష్యం వీడి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకముందే ఫ్యూజు బాక్సులకు మూతలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన వినోదాల విందు

తాటిచెట్లపాలెం: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వినోదాల విందు అలరించింది. ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజ్, కుమారి, పుషమ రాగస్ నాయుడు, నరసింహరావు, సూర్య, ఎస్ఎస్ నాయుడు, పోర్ట్ శేషులు లఘు నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శేఖర్ కుమార్ అందించిన హాస్య గుళికలు వినోదాన్ని పంచాయి. ఓం శ్రీ గురు నృత్య కళానికేతన్ శిష్యులు శాస్త్రీయ నృత్యం చేసి అలరించారు. అనంతరం అతిథులకు, కళాకారులకు మెమొంటోలు అందజేశారు.

సంక్షేమ పథకాలను చంద్రబాబు విస్మరించారు

- కేసులతో ఆటో కార్మికులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



శివాజీపాలెంలో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న పీతల గోవింద్, నాయకులు



శ్రామికనగర్‌లో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపేయడమే కాకుండా ప్రజలను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులోని శ్రామికనగర్ పరిధి 151, 185వ నంబరు బూత్‌లలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ఏడాది పాలనలో చంద్రబాబు చేసిన మోసాలు వివరించారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 140కి పైగా అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేటికీ వాటిని అమలు చేయకపోవడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. ఆటో కార్మికులు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో గత ప్రభుత్వంలో వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు లబ్ధి పొందేవారని గుర్తు చేశారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులను వివిధ కేసుల రూపంలో వేధిస్తూ వారి కుటుంబాలపై ఆర్థిక భారం మోపడం చాలా బాధాకరమన్నారు. నియోజకవర్గంలో గత నాలుగు పర్యాయాలు శాసనసభ్యుడిగా గెలిచిన వెలగపూడి రామకృష్ణ శ్రామికనగర్‌లో అభివృద్ధి చేయకపోవడం చాలా దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో శ్రామికనగర్‌ను అత్యంత ఎక్కువ నిధులతో అభివృద్ధి చేసి ప్రజల మన్ననలు పొందడం చాలా శుభ పరిణామన్నారు. ప్రజలందరూ చంద్రబాబు చేస్తున్న మోసాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించే విధంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, బూత్ కన్వీనర్లు సతీష్, క్రాంతి, గ్రామ అధ్యక్షుడు రాము, చేనేత విభాగం అధ్యక్షురాలు పద్మ, దేవుళ్లు, కుమార్, రామ్మోహన్, సూర్యనాయుడు, గిరీష్, కోటేశ్వరి, వరలక్ష్మి, నాగమణి, దేవి, అరుణ, కొండమ్మ, సన్యాసమ్మ, బండారు శ్రీను, భవాని, అప్పారావు, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం పరిధి బూత్ నంబర్ 144లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను, కూటమి ప్రభుత్వ అరాచకాలను పొందుపరిచిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు వంకర శశికళ, శ్రీను, భాస్కరరావు, శ్యామ్, చంద్రరావు, మదీనా, సుజాత, హరి, నీలపు మురళి, తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళలను ప్రోత్సహించాలి

తాటిచెట్లపాలెం: భారతీయ సంప్రదాయంలో భాగమైన నృత్య కళలను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ అన్నారు. శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో ఆదివారం శ్రీ నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ సారథ్యంలో విద్యార్థినులచే ఘనంగా గజ్జె పూజ చేయించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బి.పి.ఎస్.కల్యాణి, వి.కృష్ణమోహన్, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చంద్రబాబే కారణం



వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, మొల్లి అప్పారావు, నాయకులు

- ప్రజలను మోసగిస్తున్న కూటమి పాలకులు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు



జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న కె.కె.రాజు

ఆరిలోవ : ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే కారణమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆరోపించారు. జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ సమీపంలోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం నుంచి శ్రీకాంత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో కె.కె.రాజు, నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కె.కె.రాజు పార్టీ కార్యాలయం ప్రారంభించి సమావేశంలో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ కోసం కార్యాలయం ఏర్పాటు చేసిన వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్‌ను అభినందించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత పాలన అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అమరావతిలో అభివృద్ధి చేస్తున్నానంటూ ఉత్తరాంధ్రను గాలికి వదిలేసి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

ప్రస్తుతం కూటమి పాలనకు ప్రజలు విసిగిపోవడంతో ఆ పార్టీల నాయకులు ప్రజల ముందు తలెత్తుకోలేని పరిస్థితి నెలకొందని కె.కె.రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ప్రజలు వైఎస్సార్‌సీపీనే ఆదరిస్తున్నారన్నారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ కార్యకర్తలంతా కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ వార్డులో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా తనకు నేరుగా తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక కుటుంబమని తెలిపారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ఎస్సీ సెల్ రీజినల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు సురేష్, అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి బెవర జగదీష్, పలు వార్డుల అధ్యక్షులు, స్థానిక నాయకులు ప్రసంగి వాసు, బేత దుర్గారావు, వానపల్లి ఈశ్వరరావు, సత్యాల సాగరిక, బేగం, బాబూరావు, గోవింద్, పోలరావు, శ్రీనివాస్ పాత్రో, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారం

రామకృష్ణాపురంలో టీడీపీ నాయకుడి నిర్వాకం



రామకృష్ణాపురం వద్ద టీడీపీ నాయకుడు ఫుట్‌పాత్‌పై విక్రయానికి నిల్వ చేసిన క్రషర్ పిక్క



ఫుట్‌పాత్ పక్కన విక్రయానికి నిల్వ చేసిన ఇసుక

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఫుట్‌పాత్ ఆక్రమణకు గురైంది. బీఆర్‌టీఎస్‌లో ఇక్కడి సర్వీస్ రోడ్డు పక్కన పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌ను ఓ టీడీపీ నాయకుడు సొంత వ్యాపారానికి ఉపయోగించుకొంటున్నాడు. ఇక్కడి ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసి దానిపై నుంచి లారీలు, ట్రక్కులను తిప్పుతున్నాడు. సదరు వ్యక్తి క్రషర్ పిక్కను ఫుట్‌పాత్ పైనే నిల్వ చేసి గృహ నిర్మాణదారులకు విక్రయిస్తున్నాడు. దీంతో ఆ ఫుట్‌పాత్ భాగంలో ఇంకెవ్వరూ నడిచే అవకాశం లేకుండాపోయింది. దీంతో పాటు దాని సమీపంలోనే రోడ్డు పక్కనే ఇసుక నిల్వ చేసి విక్రయిస్తున్నాడు. అక్కడకు ఇసుక తీసుకొచ్చి డంప్ చేసేటప్పుడు, తిరిగి ఆ ఇసుకను విక్రయించేటప్పుడు లారీలు, ట్రక్కులు నేరుగా ఫుట్‌పాత్ పైనుంచే వెళ్లి వస్తున్నాయి. ఆ వాహనాలు తిరగడంతో ఇక్కడ ఫుట్‌పాత్ పూర్తిగా శిథిలమైపోయింది. ఇది నడవడానికి సైతం పనికిరాకుండా పోయింది. దీంతో గ్రామస్తులు ఇక్కడి ఫుట్‌పాత్ వినియోగించలేని పరిస్థితి నెలకొంది. సదరు టీడీపీ నాయకుడు "నేను ఎమ్మెల్యే మనిషినని" బీరాలు పలకడంతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ఆ వ్యాపారం జోలికి వెళ్లడం లేదని స్థానికులు అంటున్నారు. పాదచారులకు ఇబ్బంది కలిగించే విధంగా ఫుట్‌పాత్ ఆక్రమించి ఎమ్మెల్యే తాలూకా అంటే అధికారులు పట్టించుకోరా అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేసి ఫుట్‌పాత్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఇస్కాన్‌లో ఆధ్యాత్మిక శోభ



కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం 'హరే కృష్ణ, హరే రామ' నామస్మరణతో మార్మోగింది. వారాంతపు ప్రత్యేక పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను, పలు ప్రవచనాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయస్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మానవాళి రక్షణలో మడ అడవులు కీలకం



మడ అడవులు, పులుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: మానవాళిని రక్షించడంలో మేంగ్రోవ్స్ పాత్ర కీలకమని కథాకథన శిల్పి, వాయిస్ ఆర్టిస్ట్, రికార్డిస్ట్ ఎస్.సీత శ్రీనివాస్ అన్నారు. భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్‌తో కలిసి విశాఖ పబ్లిక్ లైబ్రరీ మియావాకి స్టోరీటైమ్ వీకెండ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జూలై 26న అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణ దినోత్సవం, జూలై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం జరిగాయని, మానవ చరిత్రను రక్షించడంలో మేంగ్రోవ్స్, పులుల ప్రాధాన్యం ఎంతో ఉందని తెలిపారు. మడ అడవులు ప్రకృతి తీర రక్షకులుగా ఎలా తీరాలను కాపాడతాయో, నేల క్షీణతను తగ్గిస్తాయో, జలచరాలు, పక్షులకు ఆశ్రయంగా ఉంటాయో పిల్లలకు వివరించారు. ఇవి రాబోయే తరాల భద్రతకు ఎంత ముఖ్యమో తెలియజేశారు. పులి శక్తికి, పర్యావరణ సమతుల్యతకు చిహ్నంగా ఎలా ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తుందో, దాని సంరక్షణ ఎందుకు అవసరమో వివరించారు. పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ మడ అడవులను సంరక్షించుకుంటే భవిష్యత్‌కు రక్షణగా నిలుస్తాయన్నారు.